సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



వేతన వెతలు

ఉపాధి హామీ ఉద్యోగులు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



పెళ్లి సందడి

శుభ ముహూర్తాలు మొదలు కావడంతో జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. వస్త్ర, బంగారు దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /20.7

ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవు. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇందూరుగా పేరు మార్చాలి



సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు, రాష్ట్ర అధికార చిహ్నం మారుస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా పేరును కూడా ఇందూరుగా మార్చాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో గురువారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ పేరును భాగ్యనగర్‌గా, ఆదిలాబాద్‌ను ఎదులాపురం వరంగల్లును ఓరుగల్లుగా మార్చాలని కోరారు. జిల్లాతోపాటు అర్బన్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్బన్‌లో పేదలు చాలామంది ఉన్న కారణంగా ఏడు వేల ఇళ్లు మంజూరు చేయాలని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయని వసతుల కల్పన కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. జీజీహెచ్‌ను వెయ్యి పడకల ఆస్పత్రిగా పునరుద్ధరించాలన్నారు. ఆక్రమణకు గురైన దేవాలయాల భూములు రక్షణకు చర్యలు తీసుకోవాలని, ఖిల్లా రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరారు.

18న గురుకులాల సీవోఈ పరీక్ష

ఇందల్వాయి: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ప్రతిభ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 18న ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నిజామాబాద్‌కు మరో రెండు కోర్టులు


ఖలీల్‌వాడి: జిల్లాలో అదనంగా రెండు కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి ఇచ్చినట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. మొదటి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కం ఐదో అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్టులను శనివారం ఉదయం 10 గంటలకు హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ తుకారాంజీ ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు 'కాంగ్రెస్' అభినందన సభ

ఖలీల్‌వాడి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందనసభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో మధ్యాహ్నం స్వాగత ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో సన్మాన సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్ వస్తారని తెలిపారు. నాయకులు, కార్యకార్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కేబినెట్ చాన్స్ ఎవరికో!

- కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చోపచర్చలు
- ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిల్లో ఒకరికి అవకాశం
- పార్టీలో ఏదైనా జరగొచ్చంటున్న నాయకులు, కార్యకర్తలు
- ఎమ్మెల్సీగా బల్మూరి, రాజ్యసభ ఎంపీగా అనిల్‌యాదవ్‌కు అవకాశమిచ్చిన నేపథ్యంలో ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఇప్పటివరకు కేబినెట్‌లో స్థానం దక్కలేదు. గతంలో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ మొదటి విడతలోనే మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించింది. ఈసారి ఇప్పటివరకు కేబినెట్ బెర్త్ దక్కలేదు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ కేటాయింపు ఎన్నికలకు ముందు చేస్తారా.. తర్వాత అవకాశం కల్పిస్తారా అనే విషయమై పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. ఆలస్యమవుతుండడంతో పార్టీ శ్రేణులు అనేక కోణాల్లో విశ్లేషణలు చేసుకుంటున్నారు.

■ పార్టీ అధినాయకత్వం ఏవిధంగా ఆలోచన చేస్తుందోనని ఉమ్మడి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుకుంటున్నారు. ఏఐసీసీ నాయకత్వం ఊహించని రీతిలో నిర్ణయాలు తీసుకుంటుండడంతో మరిన్ని చర్చలకు దారితీసింది. ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల విషయంలో చేసిన ఎంపిక మరింత చర్చకు తావిస్తోంది. సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు అనూహ్యంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. తాజాగా రాజ్యసభ ఎంపీగా రాష్ట్రం నుంచి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కుమారుడైన యువనాయకుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించారు. వరుసగా యువ నాయకులను పెద్దల సభకు ఎంపిక చేయడంతో పార్టీ శ్రేణులు ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నాయి.

■ నిజామాబాద్ రూరల్ నుంచి బీఆర్ఎస్ సీనియర్ నేత, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బాజిరెడ్డి గోవర్దన్‌పై గెలుపొందిన భూపతిరెడ్డికి సైతం కేబినెట్ అవకాశం కల్పించే అవకాశాలు ఉన్నట్లు కార్యకర్తల్లో చర్చలు జరుగుతున్నాయి. భూపతిరెడ్డికి గతంలో ఎమ్మెల్సీగా చట్టసభలో పనిచేసిన అనుభవం ఉంది. విద్యాధికుడు కావడంతో పాటు బలమైన కేడర్ కలిగిన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అత్యంత సీనియర్ అయిన సుదర్శన్‌రెడ్డికి స్పీకర్ పదవిని ఆఫర్ చేయగా ఆయన తిరస్కరించారు. ఈ క్రమంలో జిల్లాకు కేబినెట్ అవకాశం సైతం దక్కలేదు. పార్టీ యువ నాయకులకు అవకాశాలు కల్పిస్తుండడంతో భూపతిరెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని కార్యకర్తలు ఆశిస్తున్నారు.

అధిష్టానం వద్ద పట్టు

జిల్లాకు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న సీనియర్ నేత, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సైతం కేబినెట్ బెర్త్ దక్కుతుందనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. మహేశ్‌కుమార్‌కు పార్టీ అధినాయకత్వం వద్ద గట్టి పట్టు ఉంది. ఈ క్రమంలో ఆయన పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పీసీసీ పీఠంపై ఏఐసీసీ నాయకత్వం నిర్ణయం తీసుకోనుంది. కాగా ఎన్నికల తర్వాత ఆయనకు పీసీసీ పీఠం అప్పగిస్తారా లేక అనూహ్యంగా కేబినెట్ బెర్త్ కేటాయిస్తారా అనే విషయమై పార్టీ శ్రేణులు చర్చోపచర్చలు చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు

ఈసారి ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తరఫున ఎన్నికయ్యారు. వీరిలో ఎల్లారెడ్డి, జుక్కల్ నుంచి గెలిచిన మదన్‌మోహన్, లక్ష్మీకాంతారావు మొదటిసారిగా చట్టసభలో అడుగుపెట్టారు. దీంతో వీరికి అవకాశం దక్కే చాన్స్ లేదని అంటున్నారు. మిగిలిన ఇద్దరిలో బోధన్ నుంచి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతిరెడ్డి గెలుపొందారు. వీరిలో సుదర్శన్‌రెడ్డి గతంలో వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. దీంతో సుదర్శన్‌రెడ్డికి మొదటి విడతలోనే కేబినెట్ అవకాశం దక్కుతుందని పార్టీ శ్రేణులు భావించాయి. అయితే అలా జరుగక పోగా బెర్త్ కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వాటర్ షెడ్ పనులు పూర్తి చేయాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని సిరికొండ, వర్ని మండలాల్లో నిర్మిస్తున్న వాటర్‌షెడ్ పనులు త్వరగా పూర్తి చేయాలని వాటర్‌షెడ్ పథక రాష్ట్ర జాయింట్ కమిషనర్ శేషు కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన గ్రామీణాభివృద్ధి శాఖలో డీఆర్‌డీవో సాయాగౌడ్‌తో కలిసి వాటర్ షెడ్ పనులపై సమీక్షించారు. పీఎం కిసాన్ కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకంలో భాగంగా సిరికొండలో 12, వర్నిలో 12 గ్రామ పంచాయతీల్లో వాటర్‌షెడ్ పనులు మంజూరయ్యాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు మైక్రో వాటర్ షెడ్లు, కుంటలను నిర్మిస్తున్నారు. వీటిని పరిశీలించడానికి పథక రాష్ట్ర జాయింట్ కమిషనర్ డీఆర్‌డీవోతో సమావేశం అయ్యారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని మ్యాపు ద్వారా తెలుసుకున్నారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయించి బిల్లుల మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పథకం సాంకేతిక నిపుణులు రామచంద్ర, ఏవో రమణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కపిల్ పాల్గొన్నారు.



వాటర్ షెడ్ పనులపై సమీక్షిస్తున్న జాయింట్ కమిషనర్ శేషుకుమార్

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల సేవాలాల్ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉంటూ, సమాజ హితానికి పాటుపడాలని సేవాలాల్ మహరాజ్ చేసిన బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేసి సన్మార్గంలో నడిపించాయన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావు పాల్గొన్నారు.



సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఈవీఎంలకు లోడ్ టెస్ట్



సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియలో భాగంగా గురువారం లోడ్ టెస్ట్ నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి లోడ్ టెస్ట్ ప్రక్రియ పరిశీలించారు. ఒక్కో కంట్రోల్ యూనిట్‌కు నాలుగు చొప్పున బ్యాలెట్ యూనిట్లను అనుసంధానిస్తూ వాటి పనితీరు పరిశీలించారు. మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

త్రిమూర్తుల దివ్యక్షేత్రం

- ముస్తాబైన కంఠేశ్వరాలయం
- నేడు రథసప్తమి వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాదాయ శాఖ

నిజామాబాద్ సిటీ: స్వయంభూ శివలింగం, విష్ణువు నాభి నుంచి ఉద్భవించిన బ్రహ్మ కొలువైన అరుదైన క్షేత్రం నీలకంఠేశ్వరాలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి నీలకంఠుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5గంటలకు స్వామి వారి విమాన రథోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతేడాది రూ.50లక్షలు వెచ్చించి తయారు చేయించిన కొత్త రథంపై స్వామివారు ఊరేగనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందినవారితోపాటు నిర్మల్, జగిత్యాల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిసంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, రథం

రథోత్సవంలో పాల్గొన్న వారు రథానికి తొట్లి కడితే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని, వారి వంశాభివృద్ధి చెందుతుందని భక్తుల నమ్మకం.

కోనేరులో కొత్త నీరు

రథోత్సవము మరుసటి రోజు 17న శనివారం ఉదయం 9.30 గంటలకు రుద్ర నమక చమకములతో స్వామివారికి రుద్రాభిషేకము చేస్తూ పుష్కరిణిలో అవభృత స్నానం(చక్రతీర్థం) జరుగుతుంది. ఈనేపథ్యంలో కోనేరులోని పాత నీటిని తొలగించి కొత్తనీటిని నింపారు.

బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు

రథసప్తమి నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. అలాగే వాహనాల రాకపోకలను మళ్లించనున్నారు. కంఠేశ్వర్ ఆలయం వద్ద ఉమెన్స్ కళాశాల వైపు నుంచి వాహనాలు వెళ్లేలా వన్‌వేగా మార్చారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే వాహనాలు రైల్వేకమాన్ కిందినుంచి జిల్లా పరిషత్ చౌరస్తా, రామాలయం, చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాల మీదుగా ఆర్మూర్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వచ్చే వాహనాలు ప్రస్తుతం రూట్‌లోనే యథావిధిగా వెళ్తాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

దైవాంశ సంభూతుడు శిఖర శిల్పి

శిఖర స్థాపన చేసిన శిల్పి దైవాంశ సంభూతుడని భక్తుల నమ్మకం. శిఖరస్థాపన మార్గశుద్ధ సప్తమి (రథసప్తమి) పర్వదినమున జరిగింది. శిఖరస్థాపన చేసిన రోజున శిల్పికి తన తల్లి భోజనం ఇచ్చి వెళ్తుండగా, వెనుతిరిగి చూడొద్దని సూచించాడు. తన కుమారుడు ఎందుకు అలా చెప్పాడనే ఆతృతతో ఆ తల్లి కొంతదూరం వెళ్లాక వెనుదిరిగి చూడగా, శిల్పి అదృశ్యమయ్యాడని చెబుతారు. అదే సమయంలో తల్లి ఉన్నచోటే సమాధి అయినట్లు కథనం ప్రచారంలో ఉంది. ఆ మరునాడు అశరీర వాణి శిల్పి వంశీకుల్లో ఒకరికి కలలో కనిపించి ప్రతి సంవత్సరం రథసప్తమి రోజున ఆలయం నుంచి ఊరేగింపుగా రథంపై వచ్చి తన తల్లి సమాధిని సందర్శిస్తానని వినిపించింది. శిల్పి తల్లి సమాధి ఆలయానికి కొద్ది దూరంలో(పాలిటెక్నిక్ కళాశాల వాటర్ ట్యాంక్) ఉంది. ప్రతి సంవత్సరం రథసప్తమి నాడు రథం నీలకంఠేశ్వరాలయం నుంచి తల్లి సమాధి వరకు వచ్చి, అక్కడి నుంచి ఆలయానికి చేరుతుంది.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిరికొండ కేజీబీవీ విద్యార్థిని సంధ్యారాణి ఎంపికైనట్లు పీఈటీ స్వప్న తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహించే 19వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో హైజంప్ క్రీడా పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు పీఈటీ పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు..



బాల్కొండ: రాష్ట్ర స్థాయి అండర్–16 కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థి రాజు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థి రాజును ప్రిన్సిపాల్, పీఈటీ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ గణేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి విద్యార్థి..



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రాజేశ్వర్ రాష్ట్ర స్థాయి అండర్–16 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మధుపాల్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజేశ్వర్ పాల్గొంటాడని వివరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేశ్వర్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు..



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో ఉన్న నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీనియర్ మహిళ, పురుషుల హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సురేందర్ తెలిపారు. ఈనెల 17, 18, 19వ తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే 52వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు వి. గంగారెడ్డి, జవహర్, సదమస్తుల రమణ, అంజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన వెతలు!

- 'ఉపాధి' ఉద్యోగులకు మూడు నెలలుగా అందని జీతం
- భారంగా మారిన కుటుంబ పోషణ
- జిల్లాలో 474 మంది సిబ్బంది



గాదేపల్లి వద్ద ఉపాధిహామీ పనులను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఉపాధిహామీ విభాగంలో పని చేస్తున్న చిరుద్యోగులకు వేతనాలు కరువయ్యాయి. నెలనెలా జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. అప్పులు చేసి ఇంటిని నెట్టుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ విభాగంలో జిల్లా వ్యాప్తంగా 474 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల ద్వారా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయిస్తారు. ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు గుర్తించడంతో పాటు కొలతలు తీస్తారు. ఏపీవోలు వారి సంబంధిత మండలానికి అధికారిగా వ్యవహరించి పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తారు. జిల్లా అంతటా ఈ ఆరు కేడర్ల ఉద్యోగులే ఉపాధిహామీతో పాటు హరితహారం, ఇతర కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నారు. కానీ వేతనాలు సక్రమంగా అందకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ లేక..

ఉపాధి హామీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులందరి వేతనాలు రాష్ట్ర శాఖ నుంచే విడుదల కావాల్సి ఉంటుంది. ప్రతి నెలా ఉద్యోగుల ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నా జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో పడడం లేదు. రాష్ట్ర శాఖలో బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యం అవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. వేతనాలే కాకుండా జిల్లా, మండల కార్యాలయాలకు జనరల్ ఫండ్ కూడా విడుదల కావడం లేదు. దీంతో స్టేషనరీ, ఇతర ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె వాహనాలకు సైతం దాదాపు ఏడాదిగా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు.

జిల్లాలో ఉద్యోగుల వివరాలు	
ఫీల్డ్ అసిస్టెంట్లు	320
టీఏలు	69
ఏపీవోలు	21
ఈసీలు	14
కంప్యూటర్ ఆపరేటర్లు	42
ఇతర ఉద్యోగులు	08

ప్రతి నెలా ఇస్తే బాగుంటుంది



వేతనాలు ఆలస్యంగా రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. విధులకు న్యాయం చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు వేతనాలు ఆపకుండా ప్రతి నెలా ఇస్తే బాగుంటుంది.

– మల్లేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పెళ్లి సందడి!



వస్త్ర దుకాణంలో సందడి

- శుభ ముహూర్తాలను మోసుకొచ్చిన మాఘమాసం
- జిల్లాలో వేలాది వివాహాలు
- వస్త్ర, నగల దుకాణాల్లో రద్దీ

నిజామాబాద్ రూరల్: జిల్లాలో వివాహాల కోలాహలం ప్రారంభమైంది. ఈ నెల 11న మాఘ మాసం మొదలైంది. ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో వేలాదిగా జంటలు ఒక్కటి కానున్నాయి. వసంత పంచమి సందర్భంగా బుధవారం భారీగా పెళ్లిళ్లు జరిగాయి. ఫిబ్రవరి 16, 18, 21, 22, 24, 25, 28 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని బ్రాహ్మణులు పేర్కొంటున్నారు. మార్చి, ఏప్రిల్ చివరి వరకు శుభ గడియలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత మళ్లీ ఆగస్టు వరకు ముహూర్తాలు లేవు. దీంతో ఇప్పుడు ఎక్కువ సంఖ్యలో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ముందస్తుగా బుకింగ్‌లు..

వందల సంఖ్యలో పెళ్లిళ్లు ఉండటంతో తల్లిదండ్రులు ముందస్తు పనులపై దృష్టి సారించారు. ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్, పురోహితులు, భాజా భజంత్రీలు, డెకరేషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. వివాహాలకు అవసరమైన పట్టు వస్త్రాలు, దుస్తులు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పదిహేను రోజుల నుంచి జిల్లాలోని వస్త్ర, బంగారు దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

మంచి ముహూర్తాలు..

ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. శుభకార్యాలు జరుపుకోవడానికి ఇవి మంచి రోజులు. దీంతో ఈ వారంలో వందలాది వివాహాలు జరుగుతున్నాయి.

– రాహుల్‌శర్మ, బర్ధిపూర్

నెల రోజులుగా రద్దీ

పెళ్లిళ్ల సీజన్ కావడంతో నెల రోజులుగా నగలు కొనుగోలు చేయడానికి ప్రజలు దుకాణానికి భారీగా వస్తున్నారు. దీంతో వ్యాపారం బాగా సాగుతోంది.

– అవుసుల సుదర్శన్, బంగారం దుకాణ యజమాని, బర్ధిపూర్

ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కాలేజీకి స్వయం ప్రతిపత్తి



గుర్తింపుపత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని అనుబంధ కళాశాల ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాన్సువాడ)కు స్వయం ప్రతిపత్తి (అటానమస్) గుర్తింపు లభించింది. ఈ మేరకు గురువారం అటానమస్ హోదాను కల్పిస్తూ తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ప్రత్యేక ఉత్తర్వును జారీ చేశారు. యూజీసీ ద్వారా ఈ గుర్తింపు హోదా 2024–25 ఏడాది నుంచి కళాశాలకు వర్తిసుందని అన్నారు. ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ.. ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొత్తం 28 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటానమస్ గుర్తింపు సాధించడంలో సహకరించిన వీసీ, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు విఠల్, యూనస్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు భోజన విరామ సమయంలో నిరసన

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలుక కిషన్, నేతికుంట శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (అఖిల భారత ఉద్యోగ సమైఖ్య) పిలుపు మేరకు హక్కుల సాధన కోసం ఉద్యమానికి తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.10లక్షలకు పెంచాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని యూనిట్‌శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం కొనసాగాయి. ఉదయం నిర్వహించిన జనరల్ పరీక్షకు 107 మందికి 107 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్‌కు 149 మందికి 139 మంది హాజరు కాగా 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన జనరల్ పరీక్షలకు 14మందికి 14 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 159 మందికి 147 మంది హాజరు కాగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. బాలికలకు అదనపు హాస్టల్, హెల్త్ సెంటర్‌లో డాక్టర్ల నియామకం, అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి జయంతి, జిల్లా నాయకురాలు దేవిక, నాయకులు రవీందర్, అక్షయ్, హన్మాండ్లు, బిందు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ మార్గంలో నడవాలి

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి



వేడుకల్లో పాల్గొన్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చూపిన సన్మార్గంలో ముందుకు సాగాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ భ్రమరాంభిక అధ్యక్షతన సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను క్యాంపస్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భోగ్‌బండార్, ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో తెయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె రవీందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, రాంబాబు, కైసర్ మహమ్మద్, నీలిమ, పున్నయ్య, కిరణ్ రాథోడ్, ప్రవీణ్, శ్రీనివాస్, బానోత్ లక్ష్మణ్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపిక



మొక్కజొన్న కంకులు కాల్చే యంత్రం

సిరికొండ: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. గత డిసెంబర్‌లో జిల్లా స్థాయి ఆన్‌లైన్ ప్రదర్శనలో 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ కృతిక రూపొందించిన కార్న్‌కాబ్ రోస్టింగ్ మెషీన్(మొక్కజొన్న కంకులు కాల్చుకునే యంత్రం), 7వ తరగతి విద్యార్థి జి అద్వైత్‌రెడ్డి తయారు చేసిన పిలింగ్ దగ్రెన్స్ ఆపరేటింగ్ మెషీన్(ధాన్యాన్ని ఆరబెట్టుటకు, కుప్ప చేయుటకు ఉపయోగపడే యంత్రం)ల పనితీరు ప్రాజెక్టులను సమర్పించారు. పాఠశాల గైడ్ టీచర్ సతీశ్ నేతృత్వంలో ప్రతిభ నైపుణ్యంతో రూపొందించిన రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు..

బాల్కొండ: మండల కేంద్రంలోని శాంభవి పాఠశాల విద్యార్థులు అభిజ్ఞ, సంయుక్త, తనీష జిల్లా స్థాయి సైన్స్‌స్పైర్ అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ తెలిపారు. రాష్ట్ర స్థాయికి అభిజ్ఞ ఎంపికైందన్నారు. పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్‌తో రాజేంద్రకుమార్

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా రాజేంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మందమకరందును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉద్యోగులు డిప్యూటీ కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్: అక్రమంగా తరలిస్తున్న 66 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆర్మూర్ నుంచి ఓ డీసీఎంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం రాత్రి మండలంలోని దాస్‌నగర్ సమీపంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నవాబ్ అనే వ్యక్తి ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని అతడిని అదుపులోనికి తీసుకుని, వ్యాన్‌ను పీఎస్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అపోలో మెడికల్ ఎదుట గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం గురువారం లభ్యమైందని ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

టిప్పర్ల పట్టివేత



రెంజల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై విక్రం గురువారం తెలిపారు. మండలంలోని నీలా, పేపర్ మిల్, కందకుర్తి గ్రామాల నుంచి నిజామాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లతో పాటు వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

మావందికూర్దులో..

బోధన్‌రూరల్: మండలంలోని మావందికూర్దు శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొప్పర్గ నుంచి బోధన్ వైపు వస్తుండగా టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. టిప్పర్లను పీఎస్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో హోంగార్డు మృతి చెందాడు. కామారెడ్డిలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే సంజీవ్(44) అనే హోంగార్డు జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. షుగర్‌తో ఇతర అనారోగ్య సమస్యలు పెరిగాయి. బుధవారం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హోంగార్డు మృతికి జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

- ఐదు రోజులకు లభ్యమైన మృతదేహం
- కేసు నమోదు చేసిన పోలీసులు

సదాశివనగర్: తనకు నచ్చిన పని కాకుండా వేరే పని చేయాలంటూ కుటుంబంలో జరుగుతున్న గొడవలకు ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు రాజేశ్వర్(23) అదే గ్రామానికి చెందిన ఈదమ్మతో వివాహం జరిగింది. రాజేశ్వర్ సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెంట్రింగ్ పనులు చేయకుండా వ్యవసాయ పనులు చేయాలని భార్య చెప్పడంతో ఒప్పుకోలేదు. ఈ విషయమై కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లిన రాజేశ్వర్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులో రాజేశ్వర్ మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక మరొకరు..

ఎడపల్లి: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుర్నాపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల మల్లేశ్(35) మూడేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కల్లుబట్టీలో ఘర్షణ

- ఒకరు మృతి, పరారీలో నిందితుడు

నిజామాబాద్‌రూరల్: కల్లుబట్టీలో చోటుచేసుకున్న గొడవలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ గురువారం తెలిపారు. చంద్రశేఖర్ కాలనీకి చెందిన జలీల్‌ఖాన్(35) ఫ్లెక్సీ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. తన మిత్రుడైన భూమేశ్‌తో కలిసి చంద్రశేఖర్ కాలనీలో ఉండే కల్లుబట్టీలో కల్లు సేవిస్తుండగా సోను అనే వ్యక్తితో జలీల్‌ఖాన్ గొడవపడ్డాడు. దీంతో జలీల్‌ఖాన్ అక్కడి నుంచి పారిపోగా అతని వెంటే వెంబడించిన సోను ఓ టిఫిన్ సెంటర్ వద్ద అతన్ని దొరకపట్టి కర్రతో నెత్తిపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రరక్తస్రావమై జలీల్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు పరారీలో ఉన్నాడని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



రాము మృతదేహం

బాన్సువాడ రూరల్: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మండలంలోని కొల్లూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి రాము(23), లక్ష్మణ్ అనే ఇద్దరు అన్నాతమ్ముళ్లు బుధవారం రాత్రి కొల్లూర్ నుంచి బాన్సువాడకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడ్డారు. ఈ ఘటనలో రాము తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. లక్ష్మణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



బాల్‌రెడ్డి(ఫైల్)

సదాశివనగర్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కల్వరాల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంట బాల్‌రెడ్డి(50) తన వ్యవసాయ పొలంలో నీరు పారించేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డొంకేశ్వర్‌లో కల్తీ అవుతున్న మద్యం?

వైరల్ అవుతున్న వీడియో



డొంకేశ్వర్‌లో అర్ధరాత్రి వరకు మద్యాన్ని అమ్ముతున్న సిబ్బంది

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని లైసెన్సు గల మద్యం దుకాణంలో మద్యం కల్తీ జరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వైన్సు తెరిచి ఉండటాన్ని గమనించిన బయటి వ్యక్తులు వీడియో తీశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో, ఊరి వాట్సాప్ గ్రూపులో వైరల్ అవుతోంది. షటర్ పూర్తిగా మూసేసి అర్ధరాత్రి వరకు లోపల ఎందుకు ఉంటున్నారని వీడియో తీసిన వ్యక్తులు నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో వారు దురుసుగా మాట్లాడిన మాటలు వీడియోలో రికార్డయ్యాయి. మద్యాన్ని కల్తీ చేసి బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్సై రాహుల్‌ని వివరణ కోరగా.. విచారణ చేపడుతున్నామని, అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని 'సాక్షి'కి వివరణ ఇచ్చారు. కానీ ఓ ఎక్సైజ్ అధికారిని సైతం వివరణ కోరితే తన దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.

రెండు బైక్‌లు చోరీ

బిచ్కుంద: మండల కేంద్రంలోని కూరగాయల సంత, బస్టాండ్ ఎదుట నిలిపిన రెండు బైక్‌లు బుధవారం చోరీకి గురయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఒకే రోజు రెండు బైక్‌లు చోరీకి గురికావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నందిపేట్ మండలంలోని లక్కంపల్లి శివారులో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో రూ. 35,300 నగదు, ఎనిమిది మందిని అరెస్టు చేశారు. దాడిలో సీఐ అజయ్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.